విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ధాన్యం కొనుగోలుపై ఆందోళన వద్దు

విశాలాంధ్ర - కిర్లంపూడి : ధాన్యం కనుగోలు విషయంలో రైతులు ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదని కిర్లంపూడి మండల ధాన్యం కొనుగోలు ప్రత్యేక అధికారి, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఇఒ, ఎ రమణారెడ్డి అన్నారు. గురువారం కిర్లంపూడి మండలం జగపతి నగరంలో గ్రామంలో ఉన్న మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలులోను, తరలింపులోను ఇబ్బందులను అక్కడ ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ధాన్యం కనుగోలులోను, తరలింపులోను అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నప్పటికీ, దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు అన్నట్లుగా రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారిందన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికీ, మిల్లర్లు అనేక కొర్రీలు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుదల శాతం ప్రభుత్వం నిబంధనల ప్రకారం సరిపోతున్నప్పటికీ, తేమశాతం ఎక్కువగా ఉందని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారని తెలియజేసారు. దీంతో డిప్యూటీ సిఈఒ రమణారెడ్డి ఆయా మిల్లర్లకు ఫోన్ చేసి ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు సహకరించాలని, ఎటువంటి ఇబ్బందులు పెట్టవద్దని మిల్లర్లకు సూచించారు. అనంతరం చిల్లంగి రెవెన్యూ పరిధిలోని రైతులు ఆర బెట్టిన ధాన్యం కల్లాలను ఆయన పరిశీలిం చారు. ఆయన వెంట తహసీల్దార్ కేవీ మాధవరావు, ఎంపిడిఒ, బి. సతీష్ బాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి జోకా అమృత, గ్రామ వ్యవసాయ సహాయకులు మళ్ల రామకృష్ణ, ఆకుల సురేష్, పలువురు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన

విశాలాంధ్ర - గోపాలపురం : వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటించి సాగు చేస్తే విశ్వవ్యాప్తంగా మార్కెటింగ్ కల్పించడానికి ధ్రువీకరణ సదుపాయాన్ని రైతులకు కల్పించాలి అనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ బోసుబాబు తెలిపారు. గురువారం మండలంలోని ప వెంకటాయపాలెం గ్రామంలో క్లస్టర్ స్థాయి రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కార్యక్రమం సర్పంచ్ మేకా సతీష్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయం చేయడంలో కొంత నూతన మెలకువలను పాటించి శాస్త్రవేత్తల సిఫారసు మేరకు అవసరమెనంత వరకు మాత్రమే ఎరువులను, సస్యరక్షణ చర్యలను చేపట్టినటువంటి రైతులకు ఈ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కొవ్వూరు ఏడీఏ చంద్ర శేఖర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించిన నూతన విధి విధానాల గురించి వివరించారు. వ్యవసాయ అధికారి బి.రాజారావు మాట్లాడుతూ పంటలు ధ్రువీకరణ ఏ విధంగా చేస్తారు దానికి సంబంధించిన పూర్తి వివరాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వెంకటాయపాలెం, చెరుకు మిల్లి గ్రామ రైతులు, వీఏఏ ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి జీపీడీపీ

విశాలాంధ్ర - గోపాలపురం : గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి జీపీడీపీ ఎంతగానో దోహదపడుతుందని ఎంపీడీవో ఆర్. శ్రీదేవి తెలిపారు. ఐదు రోజుల శిక్షణా తరగతులలో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరం నందు సర్పంచులు, ఎంపీటీసీ, కార్యదర్శులుతో శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సర్పంచులు గ్రామాల అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో సమావేశాలు నిర్వహించి ప్రజల అవసరాలను రూపకల్పన చేసి శాఖల వారీగా ప్రణాళికలు రూపొందించి వాటిని అమలు చేయాలన్నారు. ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధికి సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తీసుకుని వచ్చారని ప్రజల ఇంటి వద్దకే పాలన దిశగా దీనిని సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నిధులు విధులను గూర్చి ట్రైనర్స్ సురేష్ తదితరులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వంగా నారాయణమ్మ, జడ్పిటిసి సభ్యురాలు కాకులపాటి లలితా శ్రీను, సర్పంచులు ఎండపల్లి శేఖర్ బాబు, చిలకా లక్ష్మణస్వామి, పైడి శిరీష, జొన్నకూటి మణెమ్మ, కురుకూరి ధనలక్ష్మి, మడిచర్ల ప్రసాద్, పఠాన్ అన్సర్ భాష, ఈర్పిన సుబ్రహ్మణ్యం, దాకే గంగారాణి, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

క్విజ్-2022లో వివేకానంద విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - రాజోలు : అమలాపురం అంబేద్కర్ భవనంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన క్విజ్ పోటీలో మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం వివేకానంద ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సుమారు 110 పాఠశాల నుండి 450 మంది విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనగా వివేకానంద పాఠశాల నుండి కె. ప్రజ్ఞా షారోన్, కె. శరన్ చంద్ర, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి సుమారు 8 వేల రూపాయలు విలువైన రెండు సైకిళ్లను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో గురువారం నిర్వహించిన అభినందన సభలో విజేతలను పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పివివి వర ప్రసాద్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రమశిక్షణ కల్గి ప్రణాళికతో కృషి చేస్తే విజయం సాధించవచ్చని, మిగిలిన విద్యార్థులు వీరిని ఆదర్శంగా తీసుకొని పట్టుదలతో చదవాలని ప్రసాద్ తెలిపారు. అనంతరం కరెస్పాండెంట్ పివివి వర ప్రసాద్, విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు జి. ఝాన్సీ, ఫణి లక్ష్మీ, బి. పుల్లేశ్వర రావు తదితరులు విజేతలను అభినందించారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రత్యేకంగా చూడాలి

విశాలాంధ్ర - ఏలేశ్వరం : ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రత్యేకంగా చూడడం ద్వారా వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయవచ్చు అని మండల ఎల్ఐసి ఏజెంట్ల అసోసియేషన్ సభ్యుడు రౌతు సహదేవుడు పేర్కొన్నారు. గురువారం సహదేవుడు కుమార్తె మౌనిక అల్లుడు అనిల్ కుమార్ వివాహ వార్షికోత్సవ సందర్భంగా స్థానిక భవిత (దివ్యాంగుల) మనోవికాస పాఠశాలలో విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాల సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. అనంతరం వాటర్ బాటిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమములో పాఠశాల ఉపాధ్యాయులు వాణి, సరస్వతి, మౌనిక తల్లిదండ్రులు బాబాయ్, పిన్ని, తాతయ్య అమ్మమ్మ తదితరులు ఉన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

విశాలాంధ్ర - ఏలేశ్వరం : నాటు సారా కాసేపు ఎందుకు ఉపయోగించే ముడుసు ఎవరికైనా 1000 లీటర్ల బెల్లం ధ్వంసం చేసినట్లు ఎస్సై సిహెచ్ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు అప్పన పాలెం శివారు దాడులు నిర్వహించగా తిరుమాలి గ్రామానికి చెందిన పెందెం శ్రీను నాటు సారా కాసేందుకు సిద్ధం చేసిన ముడి సరుకు వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి అతని వద్ద నుండి పది లీటర్లు సారాను స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో కానిస్టేబుల్ శివగంగా, హెూంగార్డులు శ్రీను, వెంకటరమణలు ఉన్నారు.

ఘనజీవామృతంతో పోషకాల పెంపు

విశాలాంధ్ర - మామిడికుదురు : ఘన జీవామృతంతో పోషకాలు పెరుగుతాయని, సూక్ష్మ జీవుల అభివృద్ధికి తోడ్పడుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మాస్టర్ ట్రైనర్ జోషప్ తెలిపారు. గురువారం ఈదరాడ గ్రామంలో ఆర్‌బీకే పరిధిలో లీడ్ ఫార్మర్లకు, రైతులకు ఘన జీవామృతం తయారీ వాటి ఉపయోగాలు పై అవగాహన కల్పించారు. 18 రకాల విత్తనాలు రబీ డ్రై సోయింగ్ ద్వారా భూమిలో వెదజల్లి భూమిలో పోషకాలు పెంచవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఘన జీవామృతం ద్వారా భూమిలో పోషకాలు పెంచి సూక్ష్మ జీవుల అభివృద్ధికి తోడ్పడవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు వివరించారు. ఈకార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జానకి, మల్లిక, మల్లికార్జున్ రావు, రాధ, రైతులు, ఆర్‌బీకే సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ రాంబాబు మృతికి సంతాపం

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : ఉప్పాడ కొత్తపల్లి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు రావు ప్రకాశరావు (రాంబాబు) (72) గురువారం గుండెపోటుతో మరణించారు. ఆయన ఎప్పటివలే ఉదయం 7.30 గంటలకు పొలంలోకి వెళ్ళారు. 11గంటల సమయంలో ఛాతీలో కాస్త నొప్పిగా ఉండటంతో డ్రైవర్ సహాయంతో కాకినాడలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. తెలుగుదేశం పార్టీ 1983లో అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పటేల్, పట్వారీ వ్యవస్థను రద్దు చేసి మండల పరిషత్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చారు. వాటికి ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించారు. మండల పరిషత్ వ్యవస్థ ఏర్పడిన తర్వత తొలి ప్రత్యక్ష ఎన్నికలలో కొత్తపల్లి మండల పరిషత్ తొలి అధ్యక్షుడుగా తెలుగుదేశం పార్టీ నుండి గెలిచి అధ్యక్షుడుగా రాంబాబు భాధ్యతలు చేపట్టారు. వివాద రహితుడుగా, సౌమ్యుడుగా పరిపాలనలో పేరు తెచ్చుకున్నారు. రావు రాంబాబుకి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రాంబాబు మృతికి పలువురు నేతలు సంతాపం : కొత్తపల్లి తొలి మండల అధ్యక్షుడు రావు ప్రకాశరావు ఆకస్మిక మృతి పట్ల పలువురు నేతలు సంతాపం వ్యక్తం చేశారు. పిఠాపురం ఎమ్మెల్యే దొరబాబు, ఎంపి వంగా గీత, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, ప్రస్తుత ఎంపిపి కారే సుధా శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిలు మాదిరెడ్డి దొరబాబు, మాజీ జెడ్పీటీసీ, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు తదితరులు రాంబాబు మృతికి సంతాపం తెలిపారు.

ఎయిడ్స్ బాధితుల పట్ల ఉదారత చూపాలి

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ, వైఆర్‌జి కేర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక జన కళ్యాణ్ కార్యాలయం వద్ద దాతల సహకారంతో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని 2022 పురస్కరించుకొని హెచ్‌ఐవి/ఎయిడ్స్ బాధిత చిన్నారులకు, మహిళలకు పోషక ఆహారాన్నిదాతల చేతులమీదుగా వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైద్యాధికారి డాక్టర్ భరత లక్ష్మి హాజరై బాధితులు దాతలు ఇస్తున్న పోషకాహారాన్ని తీసుకుని సమయానికి మందులు వేసుకొని ఆరోగ్యంగా జీవించాలని ఒకవేళ ఏదైనా ఆరోగ్యపరంగా సమస్య వచ్చినప్పుడు అమలాపురం గవర్నమెంట్ హాస్పిటల్‌లో మెరుగైన వైద్యం అందుబాటులో ఉందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సామాజిక వితరణ కార్యక్రమానికి అమలాపురం నల్ల వంతెన వద్దనున్న కోనసీమ కేర్ హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ కారేం రవితేజ శ్రావణి దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ బాధితులు మనోధైర్యాన్ని కోల్పోకూడదని పుష్టికరమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఈ వ్యాధిని సగం వరకు నయం చేయొచ్చు అన్నారు. అనంతరం బాధితులకు పౌష్టికాహారం కిట్లను దుప్పట్లను వారి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జనకళ్యాణ్ ప్రాజెక్ట్ మేనేజర్ సాన బోయిన చిన్నబాబు, మెండి కమల, గూడూరు వెంకటరమణ, ఎస్ఐ ప్రసాద్, సాకా రంగారావు, ఎడ్ల సురేష్, హెల్పింగ్ హాండ్స్ రాజోలు, జనసేనపార్టీ అమలాపురం రూరల్ మండల అధ్యక్షుడు లింగోలు పండు, వాసంశెట్టి సుభాష్ మొఫాలాగూ వారి సహకారంతో 100 మంది హెచ్‌ఐవి ఎయిడ్స్ బాధితులకు ఒకొక్కరికి రు.850 విలువ గల పోషకాహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ జి. ఆదిలింగం జిల్లా వికలాంగ సంఘం గౌరవ అధ్యక్షులు వంటెద్దు వెంకయ్యనయుడు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జనకళ్యాణ్ సంస్థ తరపున బాధితులకు ఎప్పటికప్పుడు సహకారం అందిస్తున్న దాతలు వెంకయ్య నాయుడు, జల్లి సుజాత, గొల్లపల్లి గోపిలను పలువురు ఘనంగా సన్మానించారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - కరప : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షురాలు పెంకె లక్ష్మీ సత్తిబాబు అధ్యక్షత వహించి వివిధ శాఖల పనితీరుపై చర్చలు నిర్వహించారు. ఈ సమావేశానికి జడ్‌పిటిసి వై.సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు హాజరై గ్రామాల్లో ఉన్న మౌలిక వసతులు, డ్రైనేజీ వ్యవస్థ తదితర అంశాలపై అధికారులను నిలదీశారు. రైతులు మురుగునీరు పోయే కాలువలు మూసుకుపోవడంతో వాటిలో ఉన్న గుర్రపు డెక్క పూడికతీతలు తొలగించాలని పాతర్లగడ్డ గ్రామ సర్పంచ్ ఏసుబాబు, కొరిపల్లె గ్రామ సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు డ్రైనేజీ అధికారులకు తెలిపారు. తహసీల్దార్ పొన్నమండ శ్రీనివాస్ రెవెన్యూ విభాగానికి సంబంధించిన వివరాలు కూలంకుషంగా వివరించారు. ఏవో గాయత్రి దేవి రైతులు తప్పనిసరిగా ఈ పంట నమోదు చేసుకోవాలని, పంటలకు డ్రోన్ ద్వారా మందులు పిచికారి చేసుకునేందుకు మండలానికి ముగ్గురు వ్యక్తులను ఎంపిక చేయుట జరుగుతుందని, రైతులు గ్రూపుగా ఏర్పడిన సభ్యుల నుంచి వీరిని ఎంపిక చేసుకోవడం జరుగుతుందని ఇందులో పాల్గొన్న వారికి శిక్షణ ఉంటుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఎంఈవో బుల్లి కృష్ణవేణి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడు మృతి

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు గర్సికుటి వెంకటేశ్వరరావు (53) కల్లు గీత కై వెళ్లి మృతి చెందాడు. గురువారం ఎప్పటి లానే తన భర్త కల్లు తీసేందుకు వెళ్లాడని, మధ్యాహ్న సమయానికి రాక పోవటం తో ఆరా తీయగా తోటలో పడిపోయి ఉన్నారని, భార్య కనక భాగ్య లక్ష్మీ పోలీస్ లకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ప్రమాద వశాత్తు చెట్టుపై నుండి చనిపోయినట్లు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లపూడి ఎస్సై కె.వి.రమణ తెలిపారు. మృత దేహాన్ని పోస్ట్ మార్టం కోసం కొవ్వూరు తరలిస్తున్నట్లు తెలిపారు.

10న హెచ్‌ఆర్‌పిసిఐ అవగాహన సదస్సు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : జాతీయ చైర్మన్ ప్రసన్న కుమార్ పిలుపుమేరకు ఈనెల 10వ తారీఖున శనివారం కడప నగరంలో వైయస్సార్ ఆడిటోరియంలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (హెచ్‌ఆర్‌పిసి) అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జాతీయ చైర్మన్ తాలూరి ప్రసన్న కుమార్ మరియు స్టేట్ చైర్మన్ డా యార్లగడ్డ సురేష్ కుమార్, కోనసీమ జిల్లా చైర్మన్ కొల్లి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు కడప జిల్లా న్యాయమూర్తి, జిల్లా కలెక్టర్, ఎస్‌పి, డిఎస్‌పి, ఎంపీ ఎమ్మెల్యేలు హాజరవుతున్నట్లు ఆయన ప్రకటనలో తెలిపారు. తూర్పుగోదావరి మూడు జిల్లాలకు సంబంధించిన హ్యూమన్ రైట్స్ మెంబర్స్ అందరూ ఈ సమావేశానికి హాజరు కావలెను తెలిపారు.

పోలీస్ ఉద్యోగాలకు అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - తాళ్ళపూడి : తాళ్లపూడి మానవత శాఖ ఆధ్వర్యంలో యస్.ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు అవగాహన కార్యక్రమాన్ని ఈ నెల 10 వ తేదీ శనివారం బల్లిపాడు లోని శ్రీ కాకర్ల రామయ్య సుబ్బాయమ్మ కల్యాణ మండపంలో నిర్వహించ నున్నట్లు అధ్యక్షులు జోడాల వెంకట్ ఓ ప్రకటన లో పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ చదివిన ప్రతీ ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చు. కానిస్టేబుల్ మరియు యస్.ఐ పరీక్షలకు సిద్దమయ్యే వారంతా హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని,విజయం సాధించాలని కోరారు. ఏలూరు అబ్దుల్ కలాం కాంపిటేటివ్ అకాడమి నుండి ఇద్దరు ఫ్యాకల్టీలు వస్తున్నారని ముఖ్య అతిథిగా యస్.ఐ వెంకట రమణ , విశిష్ట అతిధి గా కొవ్వూరు సి.ఐ రమణ హాజరవుతున్నారన్నారు.

కోనసీమ జిల్లాలో మాదిగలకు రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి

విశాలాంధ్ర - అంబాజీపేట : అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మాదిగలకు రెండు అసెంబ్లీ స్థానాలు లేదా ఒక ఎంపీ ఎమ్మెల్యే స్థానం కేటాయించాలని, రాష్ట్రంలో మాదిగలకు 15 అసెంబ్లీ స్థానాలు రెండు పార్లమెంట్ ఒక రాజ్యసభ కేటాయించాలని డిమాండ్ చేస్తూ గురువారం మాదిగల రాజకీయ అస్తిత్వ పోరాట మహాసభ అంబాజీపేట కొబ్బరి పరిశ్రమ కేంద్రం కొత్తపాలెం లే అవుటు వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి మాదిగ సంఘాల జేఏసీ మాదిగ రాజకీయ జేఏసీ కన్వీనర్ ఆకుమర్తి చిన్న మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా అన్ని పార్టీల నుంచి పెద్దలు పాల్గొన్నారు. స్వాతంత్రం వచ్చి నాటినుండి నేటి వరకు మాదిగలకు రాజకీయ స్వాతంత్రం కలగలేదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని చోట్ల రాజకీయంగా అన్యాయానికి గురవుతున్నామని తీవ్ర ఆవేదన చెందారు. ముఖ్య అతిథులుగా ఎస్సీ సెల్ అధ్యక్షులు బాపట్ల ఎంపీ నందిగం సురేష్, లిడ్కప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ నిరీక్షణ జేమ్స్, గంపల సత్యప్రసాద్, ఆకుమర్తి ఆశీర్వాదం, కొల్లి సూర్యారావు, ఆకుమర్తి శ్రీను, మోకటి నాగేశ్వరరావు, తెలుగు రాష్ట్రాల ఏపీ ఎంఆర్పిస్ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ఎస్ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్, నవ్వెంద్రు వెంకటరమణ, దిగుమర్తి పౌలు, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ బ్లాస్టింగ్‌లో దంపతులు మృతి

విశాలాంధ్ర - రౌతులపూడి : మండలంలో ఎస్ పైడిపల్లి గ్రామంలో బుధవారం క్వారీలో జరిగిన ప్రమాదంలో భార్యా భర్తలు మరణించారు. గ్రామస్తులు తెలియపరచిన వివరాల ప్రకారం గిరిజన కులానికి చెందిన పోలోజు వరహాలు (28), భార్య పోలోజు లక్ష్మీ దుర్గ భవాని (25) ఇద్దరూ క్వారీ ప్రమాదానికి గురై సంఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. గత 15 నుండి 20 సంవత్సరాల మూతపడిన క్వారీ కావడంతో అక్కడ ఏ విధమైనటువంటి తవ్వకాలు గానీ బ్లాస్టింగ్ గాని చేపట్టకపోవడంతో పైడిపాల గ్రామ ప్రజలు, ఆ రోడ్డు వైపు ప్రయాణించే ప్రజలు బహిర్భూమికి మేకల రొట్ట తెచ్చుకోవడానికి ఆ క్వారీ ప్రాంతానికి వెళుతున్నారు. బుధవారం నాడు పైడిపాల గ్రామానికి చెందిన క్వారీ నిర్వాహకుడు బ్లాస్టింగ్‌కి అన్ని సిద్ధం చేసుకున్నాడు. విషయం తెలియని భార్య భర్తలు అదే క్వారీలో ఎప్పుడు వచ్చే విధంగా బహిర్భూమికి వచ్చారు. క్వారీలో వీరు ఉండడం గమనించని నిర్వాహకులు బ్లాస్టింగ్ చేశారు. దీనితో పెద్ద పెద్ద బండ రాళ్లు మీద పడి శరీరాలు గుర్తించలేని విధంగా నుజ్జునుజ్జుగా అయ్యాయి. మృతులకు మూడు సంవత్సరాలు, సంవత్సరం వయసుగల కుమార్తెలున్నారు.

దాళ్వా సాగుకు సిద్ధమైన రైతులు

విశాలాంధ్ర - సీతానగరం : దాళ్వా సాగుకు రైతులు సిద్ధమయ్యారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో సర్వా సాగు పూర్తి చేసి దాళ్వా సాగుకు ఆకుమడులను సిద్ధం చేసుకుంటన్నారు. దాళ్వాసాగుకు క్రింద మొక్కజొన్న, వరి పంటకు రైతులు సిద్ధ మయ్యారు. కానీ రైతులు సర్వా సాగుగా పండించిన వరి పంట చాలా చోట్ల ఇంకా రోడ్ల పక్కన కల్లాల్లో, బస్తాలతో ఉంది. దీనిపై రైతులు రెండవ పంట సాగుకు వచ్చినప్పటికీ ధాన్యం సేకరణ పూర్తి కాకపోవడం పై నిరాశ వ్యక్తం చేస్తున్నారు. కొత్త కొనుగోలు విధానంలో స్పష్టత లేకపోవడంతో గందరగోళ పరిస్థితి నెలకొని ఏమి చేయాలో పాలు పోని స్థితి ఏర్పడింని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నిర్దిష్ట చర్యలు చేపట్టి త్వరితగతిన కొనుగోలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు పూర్తి అయితే రెండవ పంట సాగుకు పూర్తి స్థాయిలో మొదలు పెట్టడానికి వీలు ఉంటుందని రైతులు కోరుతున్నారు.

హిమాచల ప్రదేశ్‌లో కాంగ్రెస్ విజయంతో స్వీట్లు పంపిణీ

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఫలితాల్లో 68 స్థానాలకు గాను 41 స్థానాలు కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిన సందర్భంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎపిసిసి సభ్యులు ఉమ్మిడి వెంకటరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు పార్టీ కార్యాలయం వద్ద స్వీట్లు పంపిణీ చేసి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపిసిసి మెంబరు ధర్నాల కోట శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు కోప్పన కోటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మొయ్యేటి సూర్యప్రకాశరావు, ప్రత్తిపాడు నియోజకవర్గం యూత్ అధ్యక్షులు యనుమల రాజా, కే శామ్యూల్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-ఎటపాక: డాక్టర్ పాల్రాజ్ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ సైబర్ పీస్ ఫౌండేషన్ నరసింహారావు హాజరై సైబర్ నేరల మీద అవగాహన కల్పించారు. ఇంజనీరింగ్ విద్యార్థులు, విద్యార్థినిలకు వాటి నుండి బయటపడటానికి తీసుకోవలసిన మెళకువలు, వాటి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తెలియ జేశారు.ప్రతి ఇంటిలో స్మాట్ మొబైల్ వాడటం తప్పని సరి అయినందున,దీనిని సైబర్ నేరస్తులు నేరం చేయడానికి అసానుకూలత ఏర్పడిందని తెలిపారు. దీనికి ధీటుగా విద్యర్థులు తమ మెంబెర్స్ కు స్ట్రాంగ్ పాస్ వర్డ్ ను ఎలా పెట్టుకోవాలో ఎటువంటి పద్ధతులు అనుసరించాలో అవగాహన కల్పించారు. సైబర్ నేరం జరిగినప్పుడు ఆన్ లైన్ లోనే ఏవిధంగా ఫిర్యాదులు రిజిస్టర్ చేయాలో వివరించారు. 1930 నెంబర్ కి కూడా ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. అనంతరం నరసింహారావు ని ఘనంగా సత్కరించి మెమెంటో తో అందజేశారు. కళాశాల చైర్మన్ వరలక్ష్మి, సెక్రటరీ జకరయ్య, కరెస్పాండెంట్ వి. రాజశేఖర్,ప్రిన్సిపాల్ హతీరామ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ కబడ్డీలో రాష్ట్ర స్థాయికి కొత్తపేట విద్యార్థులు

విశాలాంధ్ర - కొత్తపేట : ఏపీ సీఎం కప్ మహిళల కబడ్డీ పోటీలో జిల్లా స్థాయిలో కొత్తపేటకు చెందిన శతాబ్ది కళాశాల విద్యార్థినిలు ప్రథమస్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు కోచ్ గంగుమళ్ళ ఏసురత్నం తెలిపారు. ఈ నెల 6వ తేదీన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం గవర్నమెంట్ హైస్కూల్ నందు జరిగిన పోటీలకు కొత్తపేట శతాబ్ది డిగ్రీ కళాశాలకు చెందిన బొబ్బిలి పర్మిత విజయదుర్గ మరియు వికెవి డిగ్రీ కళాశాలకు చెందిన ఏసురత్నం, బి. కాంచన, బి. లక్ష్మీ ప్రియ, ఎం. సుందరి, టి. అనురాధ, గైట్ కళాశాల విద్యార్థినీ జి. స్వాతి ప్రభ పాల్గొన్నారు. అమలాపురం నియోజకవర్గం కబడ్డీ టీమ్ పై విజయం సాధించి జిల్లాలో ప్రథమ స్థానం సాధించారు. పురస్కరించుకొని శతాబ్ది డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కట్టా నాగ మోహన్, కళాశాల ఏవో రెడ్డి సత్యనారాయణను, విద్యార్థులను అభినందించారు.

మన రాష్ట్రానికి ఇదేం కర్మ

విశాలాంధ్ర - కరప : రాష్ట్రానికి రాజధాని లేదంటే ఆర్థిక పరిపుష్టి సన్నగిల్లి ఆఖరుకు ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు సకాలంలో చెల్లించలేని పరిస్థితికి సర్కారు చేరినట్టయ్యింది. ఇదేం కర్మ మన రాష్ట్రానికని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి పేర్కొన్నారు. కరప మండల పరిధిలోని కొరుపల్లి గ్రామంలో గురువారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి, ఇంటింటికి మీ అనంతలక్ష్మి కార్యక్రమాలను నిర్వహించారు. ఇంటింటికి వెళుతూ గ్రామ ప్రజల యోగక్షేమాలతో పాటు ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగితెలుసుకున్నారు. అనంతరం అనంతలక్ష్మి సత్తిబాబు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో ముందుండాలి గాని అప్పుల్లో, ఈడీ కేసుల్లో, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో మాత్రం మొదటి స్థానంలో నిలిచిందని ఎద్దేవా చేశారు..ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలని పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుల్లిపల్లి శ్రీనివాసరావు, మాజీ జడ్పిటిసి బుంగా సింహాద్రి నాయకులు కోటగిరి మహేంద్ర బాబు, కాకర్ల బుజ్జి చౌదరి, చీపురుపల్లి జయేంద్రబాబు, పబ్బినీడి చినబాబు, గుబ్బల భాస్కరరావు, మద్దూరు స్వామి, మట్టా ప్రకాష్ గౌడ్, చప్పిడి వెంకటేశ్వరరావు, పంపన కన్నారావు, రెడ్డి వీర వెంకట సత్యనారాయణ, సుకుమార్, హరినాథ్, జయకృష్ణ, నలుకుర్తి వీరన్న, బొజ్జ భవాని, మహేంద్ర బాబు, పులపకూర శుభ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ఇదేమి కర్మ బాబు

విశాలాంధ్ర - కొత్తపేట : వైసీపీ ప్రభుత్వంలో ఇదేమి కర్మరా బాబు అంటూ ప్రజలు గగ్గోలు పెడుతున్నారని టీడీపీ బూత్ కన్వీనర్ చౌడప్ప అన్నారు. గురువారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా కొత్తపేట మహత్మగాంధీ రోడ్డులో బూత్ కన్వీనర్ చోడపనిడి వేంకటేశ్వరరావుబాబు ఆధ్వరంలో జరిగిన కార్యక్రమానికి గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్ బుషి జయలక్ష్మి, గ్రామ వార్డు సభ్యురాలు పప్పుల గంగభవాని, ముత్యాల బాబ్జి, మిద్దె ఆదినారాయణ, యల్లమిల్లి జగన్, చొడపనిడి భాష్కరరావు, అద్దంకి చంటిబాబు, బుషి విష్ణు, బండి రాజు, కాశి దనరారాజు, పాలంగి శ్రీను, పల్లి వర్మ, పాలంగి ఆశ్వరాదం, సీతారామరాజు, అన్నవరం పావని కుమారి, ముద్రగడ ఫణి, నాయకులు, కార్యకర్తలు విచ్చేశారు.

ప్రజా శ్రేయస్సుకు పాటుపడుతున్న ముఖ్యమంత్రి

విశాలాంధ్ర - యు కొత్తపల్లి : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడుతున్నారని పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వంలో కార్యక్రమంలో భాగంగా గురువారం అమరవిల్లి గ్రామంలో ఆయన పర్యటించారు. ఆయన గడప గడపకు తిరిగి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల కోసం ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో మరల జగన్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టాలని తెలిపారు. అమరవిల్లి శివారు తమ్మయ్యపేటలో వాసులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే దొరబాబు స్పందించి త్వరలోనే ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారేసుధా శ్రీనివాస్, వైస్ ఎంపీపీ మాదిరెడ్డి దొరబాబు మండల అధ్యక్షులు ఆనాల సుదర్శన్, అమరవిల్లి సర్పంచ్ పులి జయబాబు, గోరిసే కాపురెడ్డి, బండి దావీదు, సతీష్ రెడ్డి, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పురపాలక సంఘ పరిధిలో గడపగడపకి మన ప్రభుత్వంలో భాగంగా తొమ్మిదివ వార్డు నందు సిసి రోడ్డు రూ.5 లక్షలతో నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమం గురువారం మున్సి పల్ చైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్సిపి టౌన్ ప్రెసిడెంట్ సంసాని వెంకట చంద్రశేఖర్, వైస్ చైర్మన్ రుద్రరాజు వెంకటరాజు, మట్టపర్తి నాగేంద్ర, దొమ్మేటి రాము, కట్టోజు సన్నాయి దాసు, బందారు గోవిందు, బొర్రా చిట్టిబాబు, గొలగోటి విజయలక్ష్మి, గండి హారిక ప్రియ, తిక్క సత్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు, డిఇఇ అప్పలరాజు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు రెడ్డి సత్యనారాయణ, గండి స్వామి, తిక్క సత్య ప్రసాద్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డిపార్ట్ మెంట్ పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

- ఇన్‌చార్జి డిఆర్వో కె.పెంచల కిషోర్

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే డిపార్ట్ మెంట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సమన్వయ అధికారి, ఇన్‌చార్జి జిల్లా రెవిన్యూ అధికారి కె.పెంచల కిషోర్ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక జిల్లా కలెక్టరు వారి కార్యాలయంలో గల డిఆర్ఓ ఛాంబర్ లో డిపార్ట్ మెంట్ పరీక్షలకు విధులు నిర్వహించే వివిధ శాఖల అధికారులతో ముందస్తు ఏర్పాట్లు గురించి ఇంచార్జి డిఆర్వో కె.పెంచల కిషోర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవిద్యాలయ జూనియర్ కాలేజీ, సర్ సి ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, ఏలూరు నందు నేటి నుండి 14 వ తేదీ వరకు డిపార్ట్ మెంట్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయంగం. 9 గం. నుంచి11 గం.లవరకు తిరిగి మధ్యాహ్నం గం.2 గం. నుంచి సా.4 వరకు రెండు పూటల పరీక్షలు నిర్వహించడం జరుతుందన్నారు. పరీక్షల నిర్వహణ సమయంలో ఆయా కేంద్రాల వద్ద పోలీసు శాఖ కట్టుదిట్టమైన బందోబస్ట్ ఏర్పాటు చేయాలన్నారు.పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపింగ్ జరిగినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కె.పెంచల కిషోర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

విశాలాంధ్ర-టి.నరసాపురం: పరిసరాల పరిశుభ్రతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఎన్.తిరుపతి స్వామి తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ 2023 కార్యక్రమంలో భాగంగా తిరుమల దేవిపేట పంచాయతీలో గురువారం పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సేకరించిన తడి పొడి చెత్త నుండి సంపద తయారు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గంగరాజు, పంచాయతీ కార్యదర్శి టి. శ్రీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర - వేలేరుపాడు : మండలానికి చెందిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు పునరావాస ప్రాంతంలో గురువారం కమిటీని ఏర్పరుచుకున్నారు. బద్దె కృష్ణ ఆధ్వర్యంలో చల్లవారిగూడెంలో జరిగిన కమిటీ ఎన్నికల్లో గిళ్ళా వెంకటేశ్వర్లును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడు పెరుమాళ నరసింహరావు, కార్యదర్శిగా బుడిపిటి వెంకటేశ్వర్లును యూత్ నాయకులుగా బద్దె ప్రేమ్ కుమార్,వలపర్ల శ్రీనివాస్, కె. సుధాకర్, వర్క విశ్వనాథం తదితరులు వివిధ కేటగిరీలకు ఎన్నుకున్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కొరకు ఆ కమిటీ కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఉపాధి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రతి కుటుంబానికి పని చూపించాలని విజ్ఞప్తి చేశారు. కమిటీ ఏర్పాటుపై స్థానిక నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వరక బాలకృష్ణ, కొండా వీరేంద్ర, బద్దె ప్రసన్న కుమార్, వరక లక్ష్మణ్, వలపార్ల రవి, కృపవరం, బద్దె వీరబాబు, పవన్,మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలు ఇవ్వండి

విశాలాంధ్ర - వేలేరుపాడు : అనేక ఏళ్లుగా గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కన్వీనర్ ఎస్కే గౌస్ డిమాండ్ చేశారు. రామవరంలో గురువారం మండల కార్యదర్శి గడ్డల ముత్యాలరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలు ఇవ్వకుండా పలు కారణాలు చూపిస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని వాపోయారు.2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీల పెట్టుకున్న దరఖాస్తులపై గ్రామ సభలు నిర్వహించి ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు ఇస్తామని చెప్పి కూడా గత రెండు సంవత్సరాలుగా పట్టాలు ఇవ్వడానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఆదివాసీల సంక్షేమం కోసం పాటుపడుతున్నామని చెబుతున్న ప్రభుత్వం వారికి సత్వరమే న్యాయం చేయాలన్నారు.పేదవాగు ప్రాజెక్టు కాలువలను మరమ్మత్తులు చేపట్టి పంటలకు సాగునీరు అందించాలన్నారు. 2014లో రాష్ట్రం విడిపోయినప్పటినుండి నేటి వరకు కాలువలు మరమ్మతులు చేపట్టకపోవడం వలన పంట పొలాలకు నీరు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతులు సకాలంలో నీరు అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ఆ సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో మండల సహాయ కార్యదర్శి సిరికొండ రామారావు, రామవరం ఎంపీటీసీ సోయం చంద్రావు, నాయకులు కట్ట వీరాస్వామి, కారం బాబురావు, మడకం నాగేశ్వరావు, తెల్లం సింగయ్య, బంధం సింగయ్య, మహిళా సంఘం నాయకురాలు ఎస్కే నయీా మునిసా, గడ్డాల వీరమ్మ, ఆసి సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో గొల్లపల్లి విద్యార్థుల ప్రతిభ



విశాలాంధ్ర- నూజివీడు టౌన్ : రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో గొల్లపల్లి శ్రీఅన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రధాన ఉపాధ్యాయిని పి.రాధికా రాణి గురువారం ప్రకటన లో తెలిపారు. ఈనెల 5 , 6 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలు ఈర్ల జయశ్రీ అనూష, గండికోట వాసవి లుపోటీల్లో కాంస్య పథకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పల్లగాని వెంకటేశ్వరరావు ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగిరెడ్డి, పద్మ, ప్రవీణ్, మనోహరం, దుర్గా మల్లేశ్వరి, శివ నాగమణి, కోటేశ్వరమ్మ, సౌజన్య, సుశీల కుమారి, మోహనరావు, పుల్లారావు, ఫిజికల్ డైరెక్టర్ పి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతులు శాస్త్రీయ పద్ధతులలో పంటలు పండిస్తే అధిక దిగుబడులు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : పొగాకుతో పాటు ఇతర పంటలను రైతులు శాస్త్రీయ పద్ధతులలో పండించినట్లయితే అధిక దిగుబడులను సాధించవచ్చునని సి టి ఆర్ ఐ రాజమండ్రి డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ సూచించారు. గురువారం జీలుగుమిల్లి సి టి ఆర్ ఐ లో సమగ్ర శాస్త్రీయ విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి, పశువుల దాణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న, చిన్న కారు రైతులు పశువులు పెంపకం వల్ల కలిగే లాభాలను వివరించారు. మందుల పిచికారిలో నూతన పద్ధతులు తెలుసుకోవాలని రైతులకు సూచించారు. మేలు రకం పొగాకు వంగడాలు అయిన ఎఫ్ సి జే 11 దీనిని రైతులు పండించాలన్నారు. పొగాకు పసుపు పూల బంతి తోటలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెడ్ సుబ్బయ్య, శాస్త్రవేత్త కె. సరళ, మేనేజర్ ఎం.విజయకృష్ణ ,అసిస్టెంట్ మేనేజర్ ఎస్. సింహాచలం, సిబ్బంది టి. రమేష్, బిందు, ఎ. ప్రభు వెంకటేశ్వరరావు, టి. శ్రీను, దుర్గారావు రైతులు పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

విశాలాంధ్ర - భీమవరం : శాశ్వత భూ హక్కు-భూ రక్షా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి.సాయి ప్రసాద్ జిల్లా జాయింట్ కలెక్టర్లను ఆదేశించారు.గురువారం అమరావతి నుండి రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి.సాయి ప్రసాద్ జిల్లా జాయింట్ కలెక్టర్ లతో రీసర్వే పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక వీడియో కం నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ జె.వి మురళి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు .రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ వివాదరహితమైన భూ హక్కును కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా భూ రీ సర్వే పనులను చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 17, 584 రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వేపనులు చేపట్టడం జరుగుతుందని, ఇప్పటికే పూర్తి స్థాయిలో రీ సర్వే పూర్తి చేసుకున్న 2 వేల గ్రామాల్లోని 7,92,238 మంది యజమాను లకు నేటి నుండి భూ హక్కు పుత్రాలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. జిల్లాల్లో రీసర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ సందర్భంలో జిల్లా జాయింట్ కలెక్టర్ జె.వి మురళి మాట్లాడుతూ జిల్లాలోని 19 మండలాల పరిధిలో 293 రెవెన్యూ గ్రామాలలో భూ రీసర్వేపనులు చేపట్టాల్సి ఉండగా ఇప్పటివరకు 16 మండ లాల్లో సర్వే పనులు చేపట్టి 16 గ్రామాల్లో నూరు శాతం పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు.

మిగతా గ్రామాలలో పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. 16 గ్రామాల్లోని 8,663 మంది యజమానులకు పత్రాలను అందచేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

ఇంకా తాడేపల్లిగూడెం, పాలకోడేరు, ఆకివీడు మండలాల్లో భూ రీ సర్వే పనులు ప్రారంభించాల్సివుందని తెలిపారు.

పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ ఇప్పించండి

విశాలాంధ్ర - చాట్రాయి : పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ఇప్పించి ఉన్నత చదువులను ప్రోత్సహించాలని ఎంబిఎ విద్యార్థిని పరసా శ్వేత కోరారు. చాట్రాయి మండలం చనుబండ గ్రామంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడపగడపకు కార్యక్రమంలో హాజరైన నూజివీడు శాసనసభ్యులు ప్రతాప్ అప్పారావుతో ఆమె మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో చదువుకునే వారికి అమ్మఒడి ఇస్తున్నారు గాని, పీజీ చదువుకునే వారికి రియంబర్స్మెంట్ ఇవ్వకపోవడం వలన డిగ్రీ తోనే అనేకమంది చదువులు ఆపేస్తున్నారన్నారు. పీజీ చదువుకునే వారికి కూడా రియంబర్స్మెంట్ ఇస్తే ఉన్నత చదువులను ప్రోత్సహించిన వారవుతారన్నారు. ఎంబిఎ చదువు కుంటున్న తనకు ప్రభుత్వం నుండి ఏ విధమైన సహకారం అందడం లేదన్నారు.2020లో తనకు డిగ్రీ ఫైనల్ ఇయర్ లో రావలసిన విద్యా దీవెన నేటికీ రానేలేదన్నారు.ఎంఎల్ఎ ప్రతాప్ వివరణ ఇస్తూ కరోనా సమయంలో రావలసిన విద్యా దీవెన ఆలస్యమైందన్నారు. ఖచ్చితంగా వస్తుందన్నారు. రియంబర్స్మెంట్ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. రాత్రి పొద్దుపోయే వరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ కోపరేటివ్ యూనియన్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవ రెడ్డి, వైసిపి మండలాధ్యక్షులు మిద్దె బాలకృష్ణ, చనుబండ సర్పంచ్ జ్యోతి రామకృష్ణ, జల్లేపల్లి పరమేశ్వరరావు, వనమా వాసు, వంకినీ వెంకటేశ్వరరావు, మోరంపూడి నాగేశ్వరరావు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లోని విద్యార్థులకు రక్తహీనత లేకుండా నివారించాలి



విశాలాంధ్ర - భీమవరం : ప్రభుత్వ వసతి గృహాలలో ఉంటున్న ఒక్క విద్యార్థి కూడా రక్తహీనత కలిగి ఉండకూడదని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి అన్నారు.అమరావతి నుండి గురువారం స్టేట్ డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ సీఈవో జి.ఎస్.ఆర్.కె.ఆర్ విజయ్ కుమార్ సస్టైనబిలిటీ డెవలప్మెంట్ గోల్స్ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ వసతి గృహాల్లో నివసిస్తున్న విద్యార్థులకు మూడు పూటల పౌష్టిక ఆహారం అందజేయడం జరుగుతున్నదని, రక్తహీనత అనే ప్రశ్న తలెత్తకూడదన్నారు. ఎస్ సి, ఎస్ టి, బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో రక్త పరీక్షలు చేయించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. మహిళలకు, పిల్లలకు, కౌమారదశ బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించే సందర్భంలో ప్రస్తుత గృహాల వారి కుటుంబ సభ్యుల సమాచారాన్ని వినియోగించుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి దాసిరాజు, సిపిఓ కె.శ్రీనివాసరావు, డి.ఈ.ఓ ఆర్.వి రమణ, జిల్లా అభివృద్ధి అధికారి అప్పారావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

108 వాహనాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో తిరిగే 108 అంబులెన్సు వాహనాలను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు .ఈ సందర్భంగా వాహనంలో ఉండే పరికరాలను మందులను, 108 వాహనం కు సంబంధించి అన్ని రకాలుగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్విప్మెంట్ పనితీరును, దాని విధానాన్ని ఈ ఎం టీ దారా రాంబాబు, సిబ్బంది తెలియజేశారు. ఈ సందర్భంగా ఆంద్రూస్ మాట్లాడుతూ అత్యవసర, ప్రమాద సమయాల్లో క్షతగాత్రులకు వైద్య సహాయం అందజేయడంతో పాటు ధైర్యాన్ని కూడా కలగజేయాలని అన్నారు.సిబ్బంది ఉద్యోగ విధుల సమయంలో అత్యవసర సేవలు అందించడానికి అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలలో అత్యవసర సేవలకు వినియోగించే మందులు ఆక్సిజన్ ఇంజక్షన్లు లోటుపాట్లు ఉంటే అధికారులు దృష్టికి రావాలని ఆంద్రూస్ సూచించారు.

మనసున్నోడుకు అంతర్జాతీయ స్థాయి అవార్డు

విశాలాంధ్ర -భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన ఆదిత్య విద్యాసంస్థల అధినేత ఎస్.వి. పీ. కె. హెచ్. జి. కృష్ణంరాజు నిర్మాతగా ప్రముఖ రచయిత దర్శకుడు వేల్పుల నాగేశ్వరరావు దర్శకత్వంలో రూపొందిన మనసున్నోడు అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్లో బహు భాషా చిత్రాల విభాగంలో ఉత్తమ చిత్రంగా ఎంపికయ్యింది. ఈ సందర్భంగా నిర్మాత ఎస్.వి. పీ. కె. హెచ్. జి. కృష్ణంరాజు, దర్శకుడు వేల్పుల నాగేశ్వరావు గురువారం విశాలాంధ్రతో మాట్లాడుతూ ఈ సినిమాను ఉభయగోదావరి జిల్లాలోనే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిర్మించామని వాస్తవిక ఘటన ఆధారంగా సినిమాగా రూపొందించామని ఈ సినిమాను కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీలో జరుగుతున్న అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ కు పంపగా వివిధ భాషా చిత్రాలు ఎన్నో వచ్చినప్పటికీ తెలుగు ప్రజలకే గరం కారణమైన తెలుగు సినిమా మనసున్నోడికి అంతర్జాతీయ అవార్డు రావడంఎంతో అదృష్టమని ఈ ఘనత భీమవరం పట్టణానికే కాకుండా తెలుగు ప్రజలందరికీ ఎంతో గర్వకారణమన్నారు. చిత్రం లో నటించిన కళాకారులకు టెక్నీషియను వారు అభినందించారు. ఈ అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ బహుమతి ప్రధానం ఈ నెల 9, 10 తేదీల్లో హుబ్లీలో జరిగే అవార్డు ఫంక్షన్ కు తామంతా వెళ్తున్నట్లు వారు తెలిపారు.

ప్రజలకు గుదిబండ జగన్ పాలన

విశాలాంధ్ర - పిఠాపురం : మన రాష్ట్రానికి ఇదేమి కర్మ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో చిత్రాడ గ్రామ ఎస్సి పేటలో టీడీపి శ్రేణులు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపితే గాని రాష్ట్రం బాగుపడదు అన్నారు. టీడిపితోనే అభివృద్ధి సాధ్యం అని పేర్కొన్నారు. ఈ జగన్ పాలన ప్రజలకు గుదిబండలా మారిందన్నారు. వైసిపి ప్రభుత్వం ఎస్సి నిధులు మళ్ళించడంతో పాటు కార్పొరేషన్ను మూడు ముక్కలు చేసి దళితులకు అన్యాయం చేసిందన్నారు. ఎస్సిలకు ఉపయోగకరమైనా 28 సంక్షేమ పధకాలు రద్దు చేసిందన్నారు. దళితులపై దాడులు, ఆత్యాచారాలు, అక్రమ కేసులు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో అల్లుమల్లు విజయ్ కుమార్, బర్ల అప్పారావు, అడ్డగార్ల శివ, రొంగల శ్రీనువాస్, బస్వా నాగ సత్తులు, మిడతాడ బాబులు, కేతరపు కృష్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లతో ప్రభుత్వం కుమ్మక్కైంది

రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి కార్యదర్శి లంక కృష్ణమూర్తి

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం మిల్లర్లతో కుమ్మక్కై ధాన్యం సేకరణను అటకెక్కించేసిందని దీనితో ధాన్యం సేకరణ కేంద్రాల్లో కొనుగోళ్లు మందగించాయని, సంచులు సరఫరాలేదని, ధాన్యం రాసులు కళ్లాల మీద, రోడ్ల మీద పడిఉన్నాయని వెంటనే రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి కార్యదర్శి లంక కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయన భీమవరంలో ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని మిల్లర్లకు కూడా అమ్ముకోవచ్చని పౌర సరఫరాల శాఖ ఎండి జి.వీరపాండ్యన్ చేసిన ప్రకటన పలు అనుమానాలకు తావిస్తుందని ప్రకటన నేపథ్యం లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు మందకొడిగా పనిచేస్తున్నాయని ఆరోపించారు. ప్రతి గింజ కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నమ్మి రైతులు మోసపోయారని ధాన్యం కొనేవాడు లేక రైతులు దిక్కులు చూస్తున్నాడని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. నేడు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని వార్తలు వస్తున్నాయి రైతులు ధాన్యాన్ని ఎక్కడ ఒబ్బిడి చేసుకోవాలో తెలీడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, తుఫాన్లతో రైతాంగం ప్రతి ఏటా కుదేలయిపోతుందని, ప్రభుత్వ అలసత్వం మూలంగానే సార్వా అదును తప్పుతుందని దీనికి పాలకులే బాధ్యత వహించాలని ఆయన. గత ధాన్యం తాలూకు డబ్బులు చాలా మందికి రాలేదని, దీనికి తోడు రైతు భరోసా కేంద్రాల్లో కౌలు రైతులు నమోదు కావడంలేదని వీటిపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన కోరారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని పురికొనతో సహా సంచులను సరఫరా చేయాలని నిబంధనలు సడలించి ఎక్కడ ధాన్యాన్ని అక్కడ కొనుగోలు చేసి రైతాంగానికి ఒడ్డున పడేయాలని లంక కృష్ణమూర్తి డిమాండ్ చేశారు.

బాలోత్సవ కమిటీకి రూ.40 వేల విరాళం

విశాలాంధ్ర - దేవరపల్లి : ఈనెల 14వ తేదీన దేవరపల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ లో జరగనున్న బాలోత్సవ కార్యక్రమానికి టిడిపి దేవరపల్లి మండల అధ్యక్షుడు ఆంద్రు అనిల్, టిడిపి నాయకులు గన్నమని హరికృష్ణ, పెనుమత్స సుబ్బరాజు బాలోత్సవం కమిటీకి బుధవారం రూ.40 వేలు అందజేశారు. వారికి కమిటీ బాలోత్సవం బ్రోచర్లు అందజేశారు. ఈ సందర్భంగా బాలోత్సవ నిర్వహణ కమిటీ ఉండవల్లి కృష్ణారావు, బండి సూర్య ప్రకాష్ రావు, సత్యనారాయణ, కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ముగిసిన జీపీడీపీ శిక్షణా తరగతులు

విశాలాంధ్ర - మామిడికుదురు : గ్రామాల్లో ఉన్న అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని తద్వారా పంచాయితీల అభివృద్ధి పథంలో నడుస్తాయి అని ఎంపిడివో కారుపల్లి వెంకటేశ్వర రావు అన్నారు. ప్రజా ప్రణాళిక ప్రచారం కార్యక్రమంలో భాగంగా జీపీడీపీ మండల స్థాయి శిక్షణా తరగతులు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. మూడు రోజుల పాటు గ్రామాల వారీగా నిర్వహించిన శిక్షణా తరగతులు గురువారంతో ముగిశాయి. గ్రామాల్లో ఉన్న అవసరాలు గుర్తించటానికి సర్పంచ్, ఎంపిటిసి, వార్డు సభ్యులు, రిటైర్డ్ ఉద్యోగులతో కలిపి ఒక బృందంగా ఏర్పడి పారదర్శకతో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఈవోపిఆర్డి జి శివ రామ కృష్ణయ్య తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల పయనం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈ నెల 9 నుండి 13వ తేదీ వరకు జరుగనున్న 17వ జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ కు ఆంధ్రప్రదేశ్ జూనియర్ బాల బాలికల జట్లు పయనమయ్యాయని ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దారం నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వల్లే శ్రీనుబాబు, కోశాధికారి అబ్దుల్ కరీమ్, ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ అజీజ్ జట్ల సభ్యులకు క్రీడా దుస్తులను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర జట్లకు ఎంపికైన సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి. బాలుర విభాగంలో ఎన్.ఆరోన్ రోనల్ డిన్ హెరా, ఆర్.కరణ్ కుమార్ రావాల్, వై.భాను ప్రకాష్ (అనంతపురం), పి.జీవన్ గౌతమ్, జి.బాల మనోజ్ కుమార్ (గుంటూరు), ఎం.సుధానవ్ రవి నందన్ (నెల్లూరు), ఎమ్.రేవంత్ (కృష్ణా), నూరుల్ హుదా (కడప), బాలికల విభాగంలో పి.యుతిక, ఎమ్.భావన, పి.లావణ్య, జి.శ్వేతా, వై.వి.అక్షయ (కృష్ణా), ఎమ్.లిల్లి గ్రేస్ (గుంటూరు), ఎమ్.మోక్ష (కడప)లు ఎంపికయ్యారు.

రాష్టాని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చిన జగన్

విశాలాంధ్ర - గుడివాడ : ఒకప్పుడు దేశం మొత్తానికి బియ్యం ఎగుమతి చేస్తూ అన్నపూర్ణగా పేరొందిన ఆంధ్రప్రదేశ్ నేడు జగన్ రెడ్డి పాలనలో దేశం మొత్తానికి గంజాయి సరఫరా చేస్తూ యువతను డ్రగ్స్, గంజాయికు బానిసలుగా చేస్తున్న జగన్మోహన్‌రెడ్డి అని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ముజాహిద్ విమర్శించారు. గురువారం అయన ప్రకటన విడుదల చేశారు. గంజాయి అక్రమ రవాణాల్లో ఏపి మొదటి స్థానంలో ఉందన్నారు. ఏపీలో దొరికినంత గంజాయి దేశంలో మరే ఇతర రాష్ట్రంలో దొరకలేదని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్సీబీ) నివేదిక 2021 వెల్లడించిందన్నారు. 2021లో దేశవ్యాప్తంగా 7,49,761 కిలోల గంజాయి పట్టుపడితే అందులో 2,00,588 కిలోలు మన రాష్ట్రంలోనే పట్టుబడిందన్నారు. దేశంలో పట్టుబడ్డ గంజాయిలో సగం 50శాతం ఏపి. ఒర్సిసా రాష్ట్రాల్లోనే పట్టుబడిందన్నారు. దీనికి ముఖ్యమంత్రి సిగ్గుపడ్డాలన్నారు. వేల టన్నుల్లో గంజాయి రాష్ట్రం నుంచి రవాణా జరుగుతుంటే కేవలం 1775 కేసులు మాత్రమే నమోదు అయ్యాయంటే గంజాయి మాఫియాకు వైసిపి పెద్దలుకు ఏ విధంగా సహకరిస్తున్నరో స్పష్టమవుతుందన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగానికి ప్రధాన కారణం నిరుద్యోగిత, ఉద్యోగం ఉపాధి లేని నిరుద్యోగులు భవిష్యత్తుపై నిరాశ నిస్పృహలకు లోనై మత్తుపదార్థాలకు బానిసలు అవుతున్నారన్నారు. తెలుగు యువత ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు.

మహేంద్రవాడ బూత్ ఇన్‌చార్జిలతో సమావేశం

విశాలాంధ్ర - అనపర్తి : మహేంద్రవాడలో "ఇదేం ఖర్మ-మన రాష్ట్రానికి" కార్యక్రమాన్ని ఏ విధంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళాలి, ఇతర విధివిధానాలను మహేంద్రవాడ గ్రామ యూనిట్, బూత్ ఇన్‌చార్జి, ముఖ్య నాయకులతో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్య క్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా నల్లమిల్లి మాట్లాడుతూ ఇదేం ఖర్మ - మన రాష్ట్రానికి" కార్యక్రమంలో భాగంగా యూనిట్, బూత్ ఇంచార్జెస్‌లు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై అభిప్రాయాలు తెలుసుకుని, పార్టీ ఇచ్చిన అభిప్రాయ సేకరణ పత్రంలో వివరాలు సేకరించి, తప్పనిసరిగా పార్టీ నిర్దేశించిన ఫోన్ నెంబర్ 9261292612 కి మిస్డ్ కాల్ ఇచ్చే విధంగా క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జెస్‌లు ఇంటి ఇంటికి వెళ్ళి సమాచారం సేకరించాలని కోరారు. ఆ సమాచార సేకరణ పత్రాన్ని పార్టీ ఆఫీస్ కి పంపించాలన్నారు. ప్రతి ఒక్కరిని తెలుగుదేశం పార్టీకి ఓటు వేసే విధంగా చైతన్య వంతులను చేసి తెలుగుదేశం పార్టీ విజయం సాధించే విధంగా యూనిట్, బూత్ ఇంచార్జెస్‌లు కృషి చేయాలని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకట రామారెడ్డి, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసి భజనారాయణరెడ్డి, రామారెడ్డి, వాసు నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి వెంకటరెడ్డి, మండలం పార్టీ అధికార ప్రతినిధి సీతారామారెడ్డి, అన్నవరం బుజ్జి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరకుదురులో అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - పెదపూడి : మండలంలోని కరకుదురు గ్రామంలో శ్రీ అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో గురువారం అభయాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా జరిగింది. గ్రామానికి చెందిన పసుపులేటి శివ గంగ దంపతులు రూ.2,50లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ 15అడు గుల విగ్రహాన్ని అనపర్తి శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆవిష్కరించారు. తొలుత ఋత్విక్కులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. కోలాహలంగా జరిగిన ఈ కార్యక్రమంలో చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం రాష్ట్ర డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, వైస్ ఎంపీపీ కరెడ్ల వెంకన్నబాబు, వైసిపి సీనియర్ నాయకులు వాసంశెట్టి మాధవ, సానా రాంబాబు, అడపా బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహన్ రంగా అందరివాడు

విశాలాంధ్ర-విజయవాడ : గత కొద్ది రోజులు గా ఆంధ్ర తెలంగాణ రాధా రంగా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, అధ్యక్షులు కాలేపాలెం బుజ్జిపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలే అని కాపు నాయకులు, రాయలసేన మాసపత్రిక సంపదకులు పి.ఈశ్వర్ తెలిపారు.గాంధీనగర్ లోని ఆంధ్ర, తెలంగాణ రాధా రంగా మిత్రమండలి కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంగా ఆశయసాధనకు కృషి చేస్తున్న వ్యక్తి బుజ్జి అని కొనియాడారు. రంగా ఆశయాలకు అనుగుణంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్న బుజ్జికి సహాయ సహకారం అందించాలని సూచించారు.కాపు నాయకుడుగా ముద్ర వేసుకున్న వంగవీటి మోహన్ రంగా అందరివాడన్నారు.ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మా లక్ష్యం అని చెప్పారు. స్వార్థపరులైన కొందరు రాజకీయ నాయకులు జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ను కూడా కాపు నాయకుడిగా చిత్రీకరించి అందరికీ దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆంధ్ర తెలంగాణ రాధా రంగ మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కాలపాలెం బుజ్జి మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. కుల సంక్షేమ సంఘాలు నిర్వహిస్తున్న కొందరు నాపై లేని పోనీ అవాస్తవాలు సృష్టించి సోషల్ మీడియాలో వైసిపి పార్టీ కోవర్ట్ లుగా ప్రచారం చేస్తున్నారని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. వైసిపి పార్టీకి మాకు ఎటువంటి సంబంధం లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర తెలంగాణ రాధా రంగా చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రావి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు షేక్ మహమ్మద్ రియాజ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు తోట నాగరాజు పాల్గొన్నారు.

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ పార్టీగా నిలిచింది.

విశాలాంధ్ర-విజయవాడ : ఆమ్ ఆద్మీ పార్టీ పేదవర్గాల పార్టీగా ప్రజలు గుర్తించారని అందుకే ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించటంతో పాటు గుజరాత్‌లో మొదటిసారిగా ప్రాతినిధ్యం పొందటం జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు పోతిన వెంకట రామారావు తెలిపారు. గురువారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేషనల్ పార్టీ గా విస్తరిస్తుందన్నారు.అన్ని చోట్లా తాము విలువలతో కూడిన రాజకీయం చసి సామన్యలకు అండగా ఉండే విధంగా బేసిక్ పద్దతులు పాటిస్తున్నాము అన్నారు.ఢిల్లీ 134 సీట్లు కవసం చేసుకున్నాము. గుజరాత్లో 5 సీట్లు గెలిచాము. మా పార్టీ పద్దతులు నచ్చి ప్రజలు మమ్మల్ని గెలిపించారన్నారు. బిజెపి ప్రభుత్వం దౌరజన్యాలు, బెదిరింపులు,డబ్బు ప్రభావాలతో ఓట్లు సంపాదిస్తున్నారు. మేము ఢిల్లీలో ఉన్నత విద్య, నాణ్యమైన వైద్యం, అప్పులు లేని రాష్ట్రంగా, ఉచిత కరెంట్ అందిస్తున్నాము. అందుకే మాకు ప్రజలు పట్టం కట్టారన్నారు. ప్రధాని మోదీ దేశం సంపదను అంతా గుజరాతీలకి పంచిపెడుతున్నాడు. ఎపిలో కూడా మా పార్టీ విస్తరిస్తుందన్నారు. మా ధ్యేయం అప్పులు లేని రాష్ట్రంగా తీర్చి దిద్దటమే అని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతారాహిత్యంపై ఎంపీపీ ఆందోళన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ప్రజాప్రతినిధులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన విషయమై విస్సన్నపేట ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన విషయమై విస్సన్నపేట మండలపరిషత్తు కార్యాలయంలో గురువారం జరిగిన అవగాహనాసదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సదస్సుకు గ్రామ సచివాలయ సిబ్బంది పలువురు హాజరైనా, ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావలసి ఉండగా, అంతంతమాత్రంగా కూడా వీరి హాజరు లేకపోవటంతో అసహనం వ్యక్తం చేశారు. మండలంలో 12మంది సర్పంచులు, 18మంది ఎంపీటీసీ సభ్యులకు కేవలం ఇద్దరు సర్పంచులు మాత్రమే హాజరైనా, ఒకరు సదస్సు ఆరంభంలోనే వెళ్లిపోయారు. ఒక ఎంపీటీసీ సభ్యురాలు తొలుత హాజరైనా, చివరివరకు ఉండలేదు. అభివృద్ధి ప్రణాళిక లేకుండా వీరు గ్రామాల్లో ఎలా అభివృద్ధి చేస్తారంటూ ఎంపీపీ వనజాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరైన సచివాలయ సిబ్బందికి విస్సన్నపేట పంచాయతీ కార్యనిర్వహణాధికారి బీఎస్ఎస్.శ్రీనివాస్, రీసోర్సుపర్సన్లు మురళి, రామారావు, రాజు తదితరులు అవగాహన కల్పించారు. సమావేశానికి ఈవోఆర్డీ ఝాన్సీలక్ష్మి, అధ్యక్షత వహించారు.

మాదిగలు ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగ అవకాశాలు సాధించాలి

విశాలాంధ్ర - గుడివాడ : దేవదేవుడైన ఏసుక్రీస్తు చూపించిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరు పయనించి, ఉన్నత విద్యతో ఉద్యోగ అవకాశాలను సాధించాలని స్మాల్ స్కేల్ ఇండస్ట్రియల్ రాష్ట్ర డైరెక్టర్ అప్పికట్ల పటేల్ అన్నారు. గురువారం స్థానిక ఎన్‌జీవో హూమ్‌లో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన మాదిగ ఉద్యోగుల, బంధువుల ఆత్మీయ 13వ ఐక్య క్రిస్మస్ ఉత్సవ మిలాప్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత క్రిస్మస్ కేకును సభాధ్యక్షులు కె.జె విక్టర్‌పాల్ వ్యవహరించారు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రియల్ డైరెక్టర్ అప్పికట్ల పటేల్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు దండు వీరయ్య మాదిగ, పచ్చిగళ్ళ దేవనందంలు క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దండు వీరయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలుసుకోవలసినది బాబా సాహేబ్ అంబేద్కర్ రిజ్వరేషన్లు కల్పించింది, మతాలపై కాదు అనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రభుత్వాలు మతాలను అడ్డు పెట్టుకుని దళితులకు దక్కవల్సిన రిజ్వరేషన్లు నుండి దూరం చేయడానికి చూస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఎస్సీలు ఐక్యతతో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంపటి సైమన్, అత్తాటి సాల్మన్, పైడిముక్కల వంశీ, ప్రశాంత్, ఎమ్మార్పీఎస్ నాయకులు, మాదిగ ఉద్యోగులు, సంఘీయులు పాల్గొన్నారు.

7వ సారి గుజరాత్‌లో బీజేపీ అధికారం

విశాలాంధ్ర - గుడివాడ : వరుసుగా 7వ సారి గుజరాత్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం అభినందనీయమని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుత్తికొండ శ్రీరాజబాబు అన్నారు. గురువారం స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో బిజెపి పట్టణాధ్యక్షుడు అంగడాల సతీష్ అధ్వర్యంలో గుజరాత్ ఎన్నికల్లో విజయం సాధించినందుకు మిఠాయిలు పంపిణీ చేశారు.